క్లుప్తంగా

ఆలయ రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు



రహదారిని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె నుంచి గ్రామ సమీపాన వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన పాలుట్ల రంగనాథ స్వామి ఆలయం వరకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం సంబధిత అధికారులకు సూచించారు. రంగనాథ స్వామి ఆలయానికి రహదారి ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల భక్తులు మంత్రి బుగ్గనకు విన్నవించిన నేపథ్యంలో ఆదివారం డీఈ నాగిరెడ్డి, ఏఈ గణేష్ తో కలిసి ఎస్ఈ ఆలయ రహదారిని పరిశీలించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగనాథ స్వామిని వారు దర్శించుకున్నారు. అర్చకులు విష్ణువర్దన్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఎస్ఈకి తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు, వైఎస్సార్ నాయకులు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం మంగపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామవాసి, నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి ఆర్థిక సహకారంతో ప్రతి నెలా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖ డాక్టర్లు వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులకు బీపీ, షుగర్, మోకాళ్లనొప్పులు, గుండె, ఊపిరితిత్తులు, చర్మ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేకావలిరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సంజామల(కోవెలకుంట్ల): వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సంజామల ఎస్ఐ ప్రతాప్ సూచించారు. ఆదివారం మండల కేంద్రం సంజామలలో ఎస్ఐ వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు నిబంధనలు పాటించని వాహనచోదకులకు జరిమానా విధించారు.

ప్రమాద బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సచ్చింద్రబాబు

డోన్ టౌన్: అతి తక్కువ ప్రీమియంతో అందిస్తున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ప్రధాన శాఖ మేనేజర్ సచ్చింద్రబాబు సూచించారు. స్థానిక వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వడ్డేరులు ఆర్థికంగా ఎదగాలని అర్హత ఉన్నవారికి బ్యాంక్ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రు.10లక్షల నుంచి 20లక్షల వరకు పొందవచ్చున్నారు. కార్యక్రమంలో హనమాన్ దాసు, మద్దిలేటి, నాగరాజు, రామాంజనేయులు, మల్లికార్జున, గంగరాజు, దాసప్ప, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ జయంతి

డోన్ టౌన్ : పాతపేట ప్రభుత్వ హైస్కూల్లో ఆదివారం ప్రజా కవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి హెచ్ఎం పద్మావతమ్మ, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, దేవేంద్రప్ప తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా చైతన్యానికి శ్రీశ్రీ చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

రొట్టె, గుడ్లు పంపిణీ

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు ఆదివారం హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ రొట్టె, గుడ్లు, పంప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భారతి, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



బాలింతకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

చెన్నకేశవుడి ఉత్సవాలకు వేళాయె..

- తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు
- 3 నుంచి ప్రారంభం కానున్న తిరుకల్యాణ మహోత్సవాలు
- 500 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయం



శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం



శ్రీ భూలక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి

అవుకు: అవుకు పట్టణంలోని కోటలో వెలసిన శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగబంగారంగా నిత్యం పూజలందుకుంటున్నాడు. ప్రతిఏటా వైశాఖ మాసంలో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాలు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం సాయంత్రం ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి రాజవంశీయుల ఇంటి వద్దకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి తేరువీధి, రాజవీధి మీదుగా మండపం వీధి వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. మే 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఆలయ సిబ్బంది, గ్రామపెద్దలు సర్వసిద్ధం చేస్తున్నారు.

ఆలయ చరిత్ర..

16 శతాబ్దంలో నంద్యాల సంస్థానాన్ని పరిపాలించే నంద్యాల చిన్న కృష్ణమరాజు అవుకులో ఉన్న మట్టి కోటను తొలగించి రాతికట్టడంతో కోటను నిర్మించారు. ఆ సమయంలోనే ఓ రాత్రి నిద్రిస్తున్న వేళ కలలో శ్రీ చెన్నకేశవ స్వామి దర్శనమిచ్చి అవుకు కోటలో తనకు ఆలయాన్ని నిర్మించాలని సూచించనట్లు నానుడి. అంతేకాకుండా వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం తలమంచి పట్నం గ్రామంలోని ఓ రాయితోనే విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠించాలని చెప్పినట్లు పూర్వీకుల చరిత్ర. దీంతో మరుసటి రోజే చిన్న కృష్ణమరాజు తన పరివారంతో తలమంచి పట్నానికి ఆ రాతిని వెతికి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అవుకు కోటలో ప్రతిష్ఠించి ఆలయాన్ని కూడా నిర్మించారు. అదేవిధంగా స్వామివారికి దూప, దీప, నైవేధ్యాలు, అర్చకులకు, ఆలయ నౌకర్లు తదితర గుడి బాగోగుల నిమిత్తం కొంత మాన్యాన్ని ఆలయానికి రాజు దారాదత్తం చేశారు. దక్షిణ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా శ్రీభూలక్ష్మీ, లక్ష్మీదేవి, చెన్నకేశవ స్వామివార్ల ఎత్తైన ఉత్సవ విగ్రహాలను పంచలోహాలతో తయారు చేయించారు.

బెస్తలతోనే పల్లకీ సేవ..

16వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం జరిగిన తరువాత శ్రీభూలక్ష్మీ, లక్ష్మీదేవి, చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తుల పల్లకీని బోయలు చేసేవారని, అప్పట్లో ఎదో కారణాల చేత బోయల నుంచి బెస్తలకు స్వామివార్ల పల్లకీని మోసే ఏర్పాటు చేసారని పూర్వీకుల మాట. ప్రతి పర్వదినాన స్వామివార్ల పల్లకీని అవుకు బెస్తలే మోసేలా తీర్మానాలు చేశారు. పల్లకీని మోస్తున్నందుకు గాను నంద్యాల నల్లతిమ్మరాజు అవుకులో తవ్వించిన చెరువులో బెస్తలు చేపలు పట్టుకొని జీవనం సాగించేందుకు నంద్యాల వీరరాఘవరాజు ఏర్పాటు చేసినట్లు పెద్దల మాట. ఈ మేరకు 1922 జూన్ 21న అప్పటి నంద్యాల సంస్థానానికి కలెక్టర్ కార్యాలయంగా ఉన్న బళ్లారి నుంచి కలెక్టర్‌తో అధికారికంగా ఆదేశాలు తీసుకొచ్చినట్లు సమాచారం. నాటి నుంచి నేటి వరకు ప్రతి పర్వదినాన స్వామివార్ల ఉత్సవ మూర్తుల పల్లకీ సేవను బెస్తలే నిర్వహిస్తున్నారు.

ఉత్సవాలు సాగేదిలా....

శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో మే 3వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 3వ తేదీన రాత్రికి సంకల్పం, పుణ్యాహవచనం, ద్వజారోహణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, కలశస్థాపనాదులు జరుగుతాయి. 4న వైశాఖ శుద్ధ త్రయోదశి వేకువజామున శ్రీ భూ లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి ఉత్సవమూర్తులను హనుమంతు వాహనంపై, 5న వైశాఖ శుద్ధ పౌర్ణమి రాత్రి సంహవాహనంపై, 6న వైశాఖ బహుళ పాడ్యమి రాత్రి శేషవాహనంపై, 7న వైశాఖ బహుళ విదియ రాత్రి గరుడవాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. 8వ తేదీ వైశాఖ బహుళ తదియ గజవాహనముపైన ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తేరువీధి, రాజావీధి మీదుగా మండపం వీధి వరకు, తిరిగి అక్కడి నుంచి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. 9 ,10వ తేదీల్లో ఘనంగా రథోత్సవం జరుగుతుంది. 11 వ తేదీన వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. అలాగే రథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలను, 10వ తేదీన వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దూలపు ఎద్దుల పోటీలను నిర్వహిస్తున్నట్లు అవుకు రైతుసంఘం పెద్దలు తెలిపారు.

ఆయయ గాలిగోపురం నిర్మించాలి



అతిపురాతనమైన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని 16వ శతాబ్దంలో తమ వంశీయులు నిర్మించారు. దాదాపు 500 సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన ఆలయం. నాటి నుంచి నేటి వరకు స్వామివార్లు ప్రతినిత్యం విశేష పూజలు అందుకుంటున్నారు. తొమ్మిది అంతస్తులతో ఎంతో సుందరంగా నిర్మించిన గాలిగోపురం 95 సంవత్సరాల క్రితం పిడుగుపాటు వలన గాలిగోపురం ధ్వంసమైంది. గాలిగోపురం లేకపోవడం చాలా బాధాకరం. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆలయాల నిర్మాణాల్లో భాగంగా చెన్నకేశవ స్వామి ఆలయ గాలిగోపుర నిర్మిస్తే బాగుంటుంది. **–రాజవంశీయుడు, నంద్యాల రామకృష్ణమరాజు**

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

నేటి నుంచి ప్రత్యేక తరగతులు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మే 1వ తేదీ నుంచి ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8–30 నుంచి 12–30 గంటల వరకు తరగులు ఉంటాయని, ఇంటర్ ఫెయిల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేషన్ కార్డుదారులకు ఉచితంగా జొన్నలు పంపిణీ

అవుకు: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యానికి బదులుగా జొన్నలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ బచ్చు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. 15 కేజీల బియ్యం తీసుకునే ప్రతి రేషన్ కార్డుదారునికి అతని ఇష్టపూర్వకంగానే ఒక కిలో రేషన్ బియానికి బదులుగా కిలో జొన్నలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి కార్డుదారునికి ఒక్క కిలో జొన్నలు మాత్రమేనని, మిగిలినవి బియ్యమే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎండీయూ ఆపరేటర్స్ తప్పకుండా ఈ విషయాన్ని కార్డుదారులకు వివరించాలని సూచించారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి శ్రీకారం

- టెండర్ ప్రక్రియ పూర్తి.. రూ.2.50 కోట్లు కేటాయింపు
- త్వరలో పనులు ప్రారంభం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



అంకిరెడ్డిపల్లెలో పీహెచ్‌సీ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019 ఎన్నికల ముందు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామంలో ప్రచారం నిర్వహించిన సమయంలో ఇచ్చిన హామీ నెరవేరనుంది. తుమ్మల పెంట క్రాస్ రోడ్డు లోని షిర్డీసాయి బాబా ఆలయం ఎదురుగా ప్రధాన రహదారి చెంతనే 311 సర్వే నంబర్‌లో 1.81 ఎకరాల ప్రభుత్వ భూమిని పీహెచ్‌సీ నిర్మాణానికి అధికారులు కేటాయించారు. ఇటీవలనే రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పీహెచ్‌సీలకు టెండర్ల ప్రక్రియ ముగిసింది. అంకిరెడ్డిపల్లెలో నిర్మించబోయే పీహెచ్‌సీకి ప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. పది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాది వ్యవధిలోనే పనులు పూర్తి చేసి పీహెచ్‌సీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పీహెచ్‌సీ ఏర్పాటు చుట్టు పక్కల ఐదారు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా మారనుంది. అంకిరెడ్డిపల్లెతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ప్రజలు ఎక్కువ మంది నాపరాతి గనుల్లో పని చేస్తుంటారు. సాధారణ జబ్బులకు సైతం ప్రవేట్ ఆసుపత్రులను ఆశ్రయించడతంతో కాయకష్టం అంతా వైద్యానికి సరిపోతుండేది. పీహెచ్‌సీ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాటసానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం


అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామానికి చెందిన తొక్కల చిన్న రామసుబ్బయ్యకు ఆదివారం అవుకు బలిజ సంఘం పెద్దలు ఆర్థిక సాయం చేశారు. సంతానం లేని చిన్న రామసుబ్బయ్య షుగర్ వ్యాధితో కాలును కూడా కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సంఘం పెద్దలు బాధితునికి నగదు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రం అవుకు మండపం వీధికి చెందిన కొక్కు మురళీ కొంతకాలంగా అనారోగ్యానికి గురై మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం పెద్దలు కునుకుంట్ల రమణ, దంతెల రమణ, వేటూరి రమణ, జక్కామధు, శనగల వెంకటేశ్వర్లు, మామిళ్ల సుబ్బన్న, గుర్రాల రామాంజనేయులు, గాజుల కృష్ణకుమార్, సభ్యులు హరిప్రతాప్, రామ్మోహన్, ఉపేంద్ర, భాస్కర్, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి నగదు అందజేస్తున్న దృశ్యం

సన్మానం

ప్యాపిలి: విశిష్ట శతక రచయిత అవార్డుకు ఎంపికైన రాచర్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం తొగట సురేశ్‌బాబును ఆదివారం పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సీపీ బ్రౌన్ సేవా సమితి, స్వాతంత్ర్య సమరయోధుడు ఇడమకంటి బ్రహ్మారెడ్డి ధార్మిక సంఘం సంయుక్తంగా నిర్వహించిన శతక పద్య రచన పోటీల్లో తొగట సురేశ్ బాబు పాల్గొన్నారు. 'ధీరగంభీర నటనా విరాజమూర్తి జయము ఎన్టీఆర్ నిఖిలాంధ్రసాంద్ర కీర్తి' అను మకుటంతో సురేశ్ బాబు రచించిన పద్యాలకు విశిష్ట శతక రచయితగా ఎంపికయ్యాయి. ఈ అవార్డుకు ఎంపికైన సురేశ్‌బాబుకు రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతితో పాటు ఎన్టీఆర్ మహాశతకం పుస్తకంలో ఈ పద్యాలు ప్రచురితం అవుతాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత కుమారి,విజయలక్ష్మి, గోపాల్, శేషయ్య, జ్యోతి, సునీల్, లక్ష్మానాయక్, సుజాత, ప్రేమ్ కుమార్, జీవలత, ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.



సురేశ్‌బాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



రూ. 1. 20 కోట్లతో అన్ని హంగులతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం

ప్రారంభానికి ముస్తాబు !

ఎన్నో ఏళ్ల నుంచి సొంత భవనం లేక అరకొర వసతులతో అద్దెభవనంలో కొన సాగుతున్న ఎంపీడీఓ కార్యాలయానికి మహర్దశ పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో మండల కేంద్రం సంజామలలోఎంపీడీఓ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి రూ. 1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన కొత్తభవనం అన్ని హంగులతో పూర్తయింది. త్వరలో నూతన భవనాన్ని ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

– సంజామల(కోవెలకుంట్ల)

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కోవెలకుంట్ల: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పథకం ద్వారా లబ్ధిదాలకు మే నెల పింఛన్ల పంపిణీ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీఓలు మహబూబ్‌దౌలా, నాగకుమార్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయితీల్లోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 5,920 వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, తదితర పింఛన్లు ఉన్నాయన్నారు. అలాగే సంజామల మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 5,181 మందికి పింఛన్లను అందజేయాల్సి ఉందన్నారు. ఆయా గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తారని, 5వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

మే డే ఏర్పాట్లు పూర్తి

బేతంచెర్ల : కార్మిక దినోత్సవమైన మే డేను ఘనంగా నిర్వహించేందుకు కార్మిక సంఘాల నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ తదితర కార్యాలను ఎర్రజెండాలతో సుందరంగా అలంకరించారు. సీఐటీయూ కార్యాలయంతోపాటు అంగళ్ల బజార్, సూర్యనారాయణ కాలనీ, సుందరయ్యనగర్, గేటు సెంటర్, ఆర్‌యస్ రంగాపురం, బలపాలపల్లె, సిమెంటునగర్‌లో జెండా ఆవిష్కరణ ఉంటుందని కార్మిక సంఘం నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య తెలిపారు. కార్మికులు తరలివచ్చి మేడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

బేతంచెర్ల: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అని వాసవీ క్లబ్ అధ్యక్షులు సూర్య బల్లాని, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా గోపాలు అన్నారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాల్లో వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సామూహిక వడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయంలో మహిళల ఆచార వ్యవహారాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతిఒక్కరూ మన సంప్రదాయాలను పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు శేఖరయ్య, సుబ్రహ్మణ్యం, శేషఫణి, దామోదర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

బనగానపల్లెరూరల్: స్థానిక నంద్యాల రోడ్డులో ఉన్న శ్రీవీరప్పయ్యస్వామి నేలమఠంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని గరిమిరెడ్డి అచ్చమ్మ ఆలయం, రవ్వలకొండపై ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మంగారి నేలమఠంలో ఆలయ అర్చకులు శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు నాదస్వరం, సుప్రభాతం, పంచామృతాభిషేకష్టోత్తర శతమాన పూజలు, శ్రీమాతావీరకాళికాంబదేవికి కుంకుమార్చన తదితర పూజలు జరిగాయి. 11 గంటల నుంచి గరిమిరెడ్డి అచ్చమాంబ ఇంటి నుంచి స్వామి వారి 330వ సంవత్సరపు జీవసమాధి జ్ఞాపిక పతాకాన్ని అర్చకులు చిరంజీవి ఆచారి,ఆ లయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్రహ్మంగారి నేల మఠం వరకు తీసుకొచ్చి ధ్వజస్తంభానికి నిలబెట్టారు. మధ్యాహ్నం 12 గంటలకు మహాప్రసాదవితరణ, సాయంత్రం పల్లకీ సేవ, రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి.



జీవసమాధి జ్ఞాపిక పతాకాన్ని నేలమఠం వద్దకు ర్యాలీగా తీసుకొస్తున్న దృశ్యం

ఘనంగా వాసవీమాత జయంతి

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీమాత జయంతి వేడుకలను ఆదివారం మండల ఆర్య వైశ్యసంఘం, యువజన సంఘం, వాసవి మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, అష్టోత్తర శత నామావాలి, 108 కళశాలతో అభిశేకం, కుంకుమార్చన మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం వేదపండితులు నంద, పవన్ కుమార్ శర్మ, సాయి కుమార్ శర్మ ఆధ్వర్యంలో 108 మంది దంపతుల సామూహిక హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు గుండాగోపాల్, బచ్చు సుబ్రమణ్యంశెట్టి, సముద్రాల మద్దిలేటి స్వామి, కందగడ్డల రామూర్తి, చిన్ని ఎల్ల రామయ్య, రాజేంద్ర, విష్ణు, సూర్య బల్లాని,లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ మాత జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషుస్వామి అమ్మవారికి పట్టణ ఆర్యవైశ్యులతో పాలాభిషేకం చేయించారు. కుంకుమార్చన, మంగళ హారతులు తీర్థ ప్రసాద వితరణ చేసారు. పట్టణంలో రథయాత్ర, బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సీఎం శ్రీనువాసులు తండ్రి చాటకొండ మద్దయ్య జ్ఞాపకార్థం రైల్వే గేట్ల మధ్య ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

డోన్: స్థానిక తారకరామనగర్‌లో వెలసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, పంచబ్రహ్మ కలశ స్థాపన నిర్వహించారు. మంగళహారతి అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు.

పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, విష్ణు అష్టోత్తర శతనామావళి, మంత్రపుష్పం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహిచారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి కోట తిరుణాలను ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు పేట తిరునాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

శ్రీ మద్దిలేటిస్వామి ఆలయంలో యాలి పిల్లర్‌కు పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని శ్రీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో సుమారు రూ. 4 కోట్లతో పునరిర్మిస్తున్న స్వామివారి ఆలయం ముందు భాగాన యాలి పిల్లర్ నిర్మాణానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు, పాలక మండలి సభ్యులు, కంట్రాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి యాలి పిల్లర్‌కు శాస్త్రోకంగా పూజలు చేశారు. ఆలయ నిర్మాణం మే నెల చివరికి పూర్తవుతుందని, జూన్‌లో ఆలయ, ధ్వజ, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

- ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

తాడిపత్రి: పెన్నా సిమెంట్స్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న సోదం రామకృష్ణారెడ్డి (35) ఆదివారం మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామం వద్ద ఉన్న ఆ కంపెనీ గ్యారేజీలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. గ్యారేజీ ఆవరణలోని ఓ చెట్టుకు వేలాడుతూ కన్పించాడు. అయితే..అతన్ని హత్య చేసినట్లు ఆరోపిస్తూ గ్యారేజీ వద్ద భార్య సుమలత బంధువులతో కలసి ఆందోళన చేపట్టారు. సుమలత తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా సంజామల మండలం మంగపల్లికి చెందిన సోదం రామకృష్ణారెడ్డి పెన్నా సిమెంట్స్ లారీ డ్రైవర్‌గా 15 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఇటీవలనే కుటుంబాన్ని పులివెందుల పట్టణానికి మార్చాడు. వారానికి ఒకమారు ఊరికి వెళ్లి వచ్చేవాడు. ఈ నెల 15న డ్యూటీకని వచ్చిన రామకృష్ణారెడ్డి మరుసటి రోజే డ్యూటీ దిగినట్లు భార్యకు చెప్పాడు. లారీ మరమ్మతుతో పాటు అప్రూవల్ రావాల్సింది ఉందని, దీందీంతో ఊరికి రాలేకపోతున్నానని తెలిపాడు. కాగా..రామకృష్ణారెడ్డి ఆదివారం మధ్యాహ్నం గ్యారేజీ ఆవరణలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందిన స్థితిలో కన్పించాడు. సిబ్బంది అతన్ని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే..తన భర్త హత్యకు గురైనట్లు ఆరోపిస్తూ భార్య సుమలత బంధువులతో కలసి ఆదివారం రాత్రి గ్యారేజీ వద్ద ధర్నాకు దిగారు. సిమెంట్ లోడ్‌తో గ్యారేజీకి వచ్చిన తర్వాత పట్టా విప్పి ఏదో బస్తాను లారీలో ఎక్కించారని, అది బెంగళూరులో చేరాల్సిన చోటుకు చేరకపోవడంతో గ్యారేజీ నిర్వాహకులు తన భర్తను వేధించి చంపారని ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయలేదు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ధర్నా చేస్తున్న భార్య సుమలత, బంధువులు